క్లుప్తంగా

సిద్ధంగా ఓటర్ స్లిప్పులు

పుల్లలచెరువు: ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పులు సిద్ధంగా ఉన్నాయని తహసీల్దార్ దాసు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఉండే బీఎల్వోల వద్ద పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లకు సంబంధించి ఓటర్ స్లిప్‌లు సిద్ధంగా ఉన్నాయని, ఓటు వేయడానికి వచ్చే సమయంలో స్లిప్‌తో పాటు ఆధార్ కార్డుతో పోలింగ్ కేంద్రానికి రావాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సేతు మాధవన్

రాచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికలకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ గురువారం పరిశీలించారు. మండల కేంద్రం రాచర్లలోని సచివాలయం, ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భారతీబాయ్, ఆర్.పిడత గంగిరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర నాయక్, వీఆర్వో శివయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లు సహకరించాలి

గిద్దలూరు రూరల్: ఎమ్మెల్సీ ఓటర్ల ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటర్లు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. అందులో భాగంగా డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు ఆధ్వర్యంలో బూత్‌లెవల్ ఆఫీసర్లు ఓటర్ల స్లిప్పులు ఎలా పంపిణీ చేస్తున్నారనే విషయాలపై ఆమె గురువారం ఆరా తీశారు. మార్చి 13వ తేదీన నిర్వహించబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటర్ల స్లిప్పులు వారి ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయాలన్నారు. ఈ ప్రక్రియ 4వ తేదీ వరకు కొనసాగుతోందని, ప్రతి ఒక్కరూ ఓటరు బూత్‌లెవల్ ఆఫీసర్లకు అందుబాటులో ఉండాలని కోరారు.

జగనన్న గోరుముద్ద నాణ్యంగా ఉండాలి



శతకోడు పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: జగనన్న గోరుముద్ద నాణ్యతగా ఉండాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ సూచించారు. గురువారం శతకోడు, అక్కపాలెం, మర్రివేముల, ముటుకుల గ్రామాల్లోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. నాడునేడు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

పాఠశాలల తనిఖీ

దొనకొండ: మండలంలోని చందవరం పంచాయతీ పరిధి ఎస్సీ, జనరల్ పాఠశాలలను మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమాధానం రాబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్దను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కుకింగ్ నిర్వాహకులకు సూచనలు, సలహాలందించారు. అనంతరం నాడు–నేడు పనులను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్‌పీలు ఉన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

దర్శి: మండలంలోని లంకోజనపల్లి సమీపంలో సీహెచ్ చిన్న బ్రహ్మయ్యకు చెందిన వరిగడ్డి వామి గురువారం దగ్ధమై రూ.20 వేల నష్టం జరిగింది. ట్రాక్టర్‌పై వరిగడ్డి తీసుకెళ్తుండగా పైన కరెంట్ తీగలు తగిలి మంట అంటుకుంది. స్థానికులు కేకలు వేయడంతో వెంటనే గడ్డిని కింద పడేసేందుకు ట్రాలీపైకి లేపాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రాక్టర్‌కు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. సకాలంలో ఫైరింజన్ వచ్చి మంటలార్పింది.

పైపు లైన్లు ధ్వంసం

పెద్దదోర్నాల: గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ప్యానల్ బోర్డుతో పాటు నీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్లు ధ్వంసం అయ్యాయని రామచంద్రకోటకు చెందిన పలువురు రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని రైతు కర్రా మల్లారెడ్డి పొలంతో పాటు మరో ముగ్గురి పొలాల్లోని ప్యానెల్ బోర్డులు, పైపు లైన్లు ధ్వంసం చేసినట్లు ఫిర్యాదు అందటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

ఆముదం పంట పరిశీలన

పెద్దారవీడు: మండలంలో బద్వీడు చెర్లోపల్లె గ్రామం రైతు భరోసా కేంద్రం పరిధిలో ఆముదం పంటను ఒంగోలు ఆత్మ పీడీ అన్నపూర్ణ గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆముదం పంటను పరిశీలించగా తెల్లదోమ, పచ్చదోమ అధికంగా ఉందని గుర్తించారు.

శరవేగంగా గృహ నిర్మాణాలు

- ఊళ్లను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- వివిధ దశల్లో ఉన్న ఇంటి నిర్మాణాలు
- కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి



తాళ్లూరు జగనన్న లేఔట్‌లో నిర్మిస్తున్న ఇళ్లు

దర్శి టౌన్: ప్రభుత్వం సహకారంతో పేదోడి సొంతింటి కల సాకారమవుతోంది. పూరి గుడిసెలు, డేరాలు, అద్దె ఇళ్లలో కాపురాల నుంచి పేదలకు ఉపశమనం లభిస్తోంది. పక్కా ఇళ్ల నిర్మాణంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. గత ప్రభుత్వాల పాలనను తలదన్నేలా జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఊళ్లను తలపించేలా ఆశల సౌధాలు రూపుదిద్దుకుంటున్నాయి. దర్శి నియోజకవర్గంలో కనీవిని ఎరుగని రీతిలో పక్కా ఇళ్ల పునాదులు వేసుకుంటున్నాయి. నియోజకవర్గంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో 5012 నివాసాలు మంజూరయ్యాయి. అవాస్ ప్లస్ గ్రామీణ ద్వారా 2690 నివాసాలకు దరఖాస్తు చేసుకోగా అందులో జియో ట్యాగ్ ద్వారా 2686 ఇళ్లు మంజూరు చేశారు. అందులో 342 నివాసాలు ఇప్పటికే పూర్తయ్యాయి.

ఊపందుకున్న నిర్మాణాలు

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నివాసాల నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటంతో ఇప్పుడు అంతటా ఇళ్ల నిర్మాణాలు చకచకా జరుగుతున్నాయి. ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేయడంతో పాటు తక్కువ ధరకే సిమెంట్ అందిస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారు పొదుపు సంఘాల్లో లబ్ధిదారులుగా ఉంటే వారికి తక్కువ వడ్డీకే రుణాలు కూడా అందిస్తోంది. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటుకు అధికారులు కూడా ప్రత్యేక చొరవ చూపుతున్నారు. నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఇళ్ల నిర్మాణాల పూర్తికి లబ్ధిదారులకు పలు సూచనలు ఇస్తున్నారు.

ఎన్‌పీఐ ఇళ్ల నిర్మాణాల వివరాలు

మండలం	మంజూరైన ఇళ్ల సంఖ్య	బీబీఎల్	బేస్‌మెంట్ లెవల్	రూఫ్ లెవల్	పూర్తయిన ఇళ్లు
దర్శి	1163	502	220	69	261
దర్శి అర్బన్	955	411	313	54	152
తాళ్లూరు	396	214	53	16	53
కురిచేడు	805	316	112	42	208
ముండ్లమూరు	489	208	66	55	108
దొనకొండ	1204	497	240	100	283
మొత్తం:	5012	2148	1004	313	1065

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కంభం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. గురువారం స్థానిక అన్నపూర్ణ కల్యాణ మండలంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు పోటీ చేస్తున్నారని, వారికి తొలి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రతి ఒక్కరూ విజయం కోసం పాటుపడాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యాభివృద్ధికి ప్రవేశ పెట్టిన పథకాలను ఓటర్లకు వివరించాలన్నారు. గ్రామాల వారీగా పర్యటించి ఓటర్లు గుర్తించి వారు మొదటి ప్రాధాన్యం ఓటును పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థికి ఓటు వేసేలా వారిని చైతన్యపరచాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం: తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. గురువారం రాత్రి ఆయన పట్టణంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణతో కలిసి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ముఖ్యంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షలాది మంది నిరుద్యోగులను ఉద్యోగాలు కల్పించారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పెద్ద ఎత్తున వైజాగ్‌లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలవాల్సిన ఆవశ్యకతను ఎమ్మెల్యే కేపీ వివరించారు.

తూర్పు రాయలసీమ ప్రాదేశిక నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్మన్ సీహెచ్ బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, కౌన్సిలర్స్ సలీం, దూదేకుల ప్రసాద్, షేక్షావలి, ఉత్తమకుమార్, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, రోజ్ లిడియా తదితరులు ఇంటింటికీ వెళ్లి తమ గ్రాడ్యుయేట్ ఓటును మొదటి ప్రాధాన్యం ఓటుగా పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మార్కాపురంలో రూ.1300 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారని ఓటర్లకు నాయకులు వివరించారు.

కొనకనమిట్ల: తూర్పు, రాయలసీమ నుంచి పట్టభద్రుల స్థానానికి వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతు ఇచ్చి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండల వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామాల్లో గురువారం ప్రచారం చేపట్టారు. మండలంలోని గరిమినపెంట, ఇరసలగుండం, పాతపాడు గ్రామాల్లో పట్టభద్రులను కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, నాయకులు ఉడుముల గురవారెడ్డి, దొంతిరెడ్డి వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి ఓటర్లను కలిసి మద్దతు పలకాలని కోరారు. సర్పంచ్ దొంతిరెడ్డి జయమ్మ చినరామిరెడ్డి, పెదరామిరెడ్డి, కొండలు, కేవీ, నారాయణ, పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ బల పరచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి గెలుపు కోసం వైఎస్సార్ సీపీ నాయకులు ముమ్మరంగా ఇంటింటా చేస్తున్నారు. గురువారం పొదిలి మండల, పట్టణ సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షులు గొలమారి చెన్నారెడ్డి, పేరం సుభాష్‌చంద్రబోస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పొదిలి పట్టణం 3వ సచివాలయం పరిధిలో 9వ వార్డులో గొలమారి చెన్నారెడ్డి ప్రచారం చేయగా పాములపాడు సచివాలయం పరిధిలో ఈగలపాడు, పాములపాడు గ్రామాల్లో పేరం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి చేశారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరిని కలిసి వైఎస్సార్ సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు మొదటి ప్రాధాన్యంగా ఒకటి అంకెను వేయాలని అభ్యర్థించారు. ఓటు ఎలా వేయాలో కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. గూడూరి వినోద్, మైనార్టీ నాయకులు ముల్లాజాకీర్, పేరం కోదండ రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

పెద్దదోర్నాల: తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ గెలుపు కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, సర్పంచ్ చిత్తూరి హారిక, గుమ్మా యల్లేష్, సచివాలయాల కన్వీనర్ రమణారెడ్డి తదితరులు మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్



కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ రమేష్

కొనకనమిట్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఎంఈఓ దాంగే షరీఫ్‌తో కలిసి ఆయన సందర్శించారు. తొలుత జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి కుకింగ్ ఏజెన్సీలతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలన్నారు. భోజనాన్ని రుచి చూసి సూచనలు, సలహాలందించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ సూచనల మేరకు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించి మంచి ఫలితాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం వీరాస్వామికి సూచించారు. అనంతరం కేజీబీవీని సందర్శించారు. రికార్డులు పరిశీలించి బాలికలు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా ప్రభుత్వం అన్నీ రకాల మౌలిక వసతులు కలిపిస్తోందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, లైబరీని, పాఠశాల గదులు, వాటర్ ప్లాంట్, నూతనంగా ఏర్పాటు చేసిన టాయ్‌లెట్ గదులను పరిశీలిచి డీఈఓ రమేష్ సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం వీరాస్వామి, కేజీబీవీ ప్రిన్సిపాల్ సురేఖ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

కురిచేడు: మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని కనిగిరి ఆర్డీఓ సందీప్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని బోధనంపాడు, గంగదొనకొండ మండల పరిషత్ పాఠశాలల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయని, చిన్నారులు అక్కడ ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున వాటిని కూల్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటుకు ఆర్అండ్‌బీ అధికారులకు లెటర్లు పంపాలని, అదే లెటర్ తనకు ఒకటి పంపితే స్పీడు బ్రేకర్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పడమరనాయుడుపాలెంలో అంగన్‌వాడీ కేంద్రానికి పాత గ్రామ పంచాయతీ భవనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోధనంపాడు వద్ద బందిళ్లబావి రెవెన్యూ ప్రాంతంలో జరిగే మైన్స్‌కు అనుమతులు ఉన్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఎస్ఎస్‌పీ అగ్రహారంలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలించి తగు సూచనలు, సలహాలిచ్చారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాల పురోగతిపై ఆరా తీశారు. పథకాల అమలు వేగవంతం కావాలని ఆదేశించారు. పొట్లపాడు భూవివాదం జాయింట్ కలెక్టర్, సీసీఎల్ఏ, లోకాయుక్త పరిధిలో ఉందని, అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా, ఎంఈఓ వస్త్రాంనాయక్, ఇంచార్జి ఈఓఆర్డీ నరేష్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజరు సుభాషిణి, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీకాంత్, రాధాకృష్ణ, ఇంచార్జి ఆర్ఐ సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సేవలు రైతులకు చేరువ కావాలి



నువ్వుల విత్తనాలు పంపిణీ చేస్తున్న షేక్ ఎన్.మీరా

దర్శి: శాస్త్రవేత్తల సేవలను రైతులకు మరింత చేరువ చేయాలని ఐకార్ అటారీ డైరెక్టర్ షేక్ ఎన్.మీరా సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్నీ కృషి విజ్ఞాన కేంద్రాలకు అధిపతిగా ఫిబ్రవరి 14న ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత షేక్ ఎన్.మీరా తొలిసారిగా దర్శి కేవీకేను సందర్శించడంతో ఆయనకు శాస్త్రవేత్తలు ఘన స్వాగతం పలికారు. మీరా దర్శి కేవీకేలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, సమన్వయకర్తల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కేవీకేలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పర్యవేక్షించారు. మీరా మాట్లాడుతూ రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. రైతులకు ఆర్థిక అభివృద్ధికి దోహదపడే వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలపై మక్కువ చూపాలని ఆదేశించారు. సీఎఫ్ఎల్‌డీ కింద నువ్వుల విత్తనాలను రైతులకు అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ వరప్రసాద్, డాక్టర్ జి.రమేష్, జీఎస్ఓ ఉషా, జాహ్నవి, వెంకటేశ్వరరెడ్డి, లీలాకృష్ణ, కాశీవిశ్వనాథ్, శివ, మానస పాల్గొన్నారు.

పాఠశాలకు స్థలం చూపాలి



ఆర్డీఓతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: మండలంలోని పడమర నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి స్థలం చూపాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కనిగిరి ఆర్డీ ఓ సందీప్‌కుమార్‌ను కోరారు. మండలంలోని పలు అంశాలపై పరిశీలనకు వచ్చిన ఆయన్ను తహసీల్దార్ కార్యాలయలో కలిసి మాట్లాడారు. పాఠశాలకు నిధులు మంజూరై ఉన్నాయని తెలిపారు. కేవలం స్థలం లేకపోవడంతో పాఠశాల నిర్మాణం నిలిచిపోయిందని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన పమరనాయుడు వెళ్లి స్థలాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. పోలింగ్ స్టేషన్లను పరిశీలించి ఎన్నికలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు తగు సూచనలు, సలహాలిచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ నాగూల్‌మీరా, ఎంఈఓ ఆర్.వస్త్రాంనాయక్, డీటీలు శ్రీకాంత్, రాధాకృష్ణ, ఇన్‌చార్జి ఆర్ఐ సీహెచ్ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం హనుమంతరావు ఉన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి

పెద్దారవీడు: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఎన్నికల నియమావళిని ఉల్లఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో రాజకీయ నాయకులు ప్రచారం చేయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకులు ఎటువంటి అనుమతి పొందకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించవద్దని, ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని సూచించారు. ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఏఓ కె. బుజ్జిబాయి, డాక్టర్ వెంకటేశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ బాలునాయక్, వీఆర్వోలు, పీఎస్‌లు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం



విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ శోభన్‌బాబు

కురిచేడు: స్థానిక గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేసిన కంభంపాటి కోటయ్య ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్ కాంట్రిబ్యూషన్ డ్రాచేసిన నిధులు దుర్వినియోగమైనట్లు డివిజనల్ పంచాయతి అధికారి జి.శోభన్‌బాబు నిర్ధారించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఆయన స్థానిక పంచాయతీలోని రికార్డులను గురువారం పరిశీలించారు. సీఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి రూ.4.31 లక్షలు గతేడాది మార్చి 15వ తేదీన గ్రామ పంచాయతీలోని వాటర్‌ప్లాంటు ఖాతాకు బదిలీ చేశారు. ఆ ఖాతా నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో కార్యదర్శి నిధులు డ్రా చేయించి స్వాహా చేసినట్లు తన విచారణలో తేలిందని డీఎల్‌పీఓ తెలిపారు. ఆ నిధులు జిల్లా పరిషత్ కార్యాలయానికి చలానా ద్వారా చెల్లించాల్సి ఉండగా నేటి వరకూ ఆ నిధులు చెల్లించలేదని పేర్కొన్నారు. త్వరలో వాటర్‌ప్లాంట్ నిధులు కూడా పరిశీలించి ఆ నిధులపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు చెప్పారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

మార్కాపురం టౌన్: గర్భిణులుగా ఉన్న మహిళలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి పుట్టబోయే బిడ్డ ఆగ, మగ అని తెలుసుకోవటం నేరమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాహుల్ అన్నారు. గురువారం ఆయన జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో భేటీ బచావో– భేటీ పఠావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ప్రసంగించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి మూడు నుంచి ఐదేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, పట్టణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీపిక మంజూష, డాక్టర్ రాజశేఖర్, ఉపాధ్యాయురాలు ఆర్‌ఎం రఘూన్నీసాల్ పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ, వెంకటరెడ్డి

ముండ్లమూరు: మండలంలోని కెల్లంపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం మండల వ్యవసాయాధికారి మేరమ్మ శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని లక్ష్యంతో మండలంలో శనగల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పసుపుగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రంలో మండలంలోని రైతులందరూ శనగలు అమ్మకోవచ్చన్నారు. పసుపుగల్లు సొసైటీ అధ్యక్షుడు కుమ్మిత వెంకటరెడ్డి, సీఈఓ వీరవెంకట నరసయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న జువాలజీ అధ్యాపకుడు సుబ్బారెడ్డి

పెద్దారవీడు: విద్యార్థులు తం సామర్థ్యాలను ఉపయోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని దోర్నాల ప్రభుత్వ జూనియర్ కళాశాల జువాలజీ అధ్యాపకులు కేవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ షేక్ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నాలుగో వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ప్రయాసలకు ఓర్చి పిల్లలను చదివిస్తారని, ప్రతి ఒక్కరూ మదిలో పెట్టుకొని క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్థానికులు కాసు వెంకటరెడ్డి, వి. ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిండు గర్భిణికి అభయం

కురిచేడు: సంచార జాతులకు చెందిన నిండు గర్భిణికి కాన్పుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని కనిగిరి ఆర్డీఓ సందీప్‌కుమార్ ఆదేశాలు జారీ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. తనకు ఎటువంటి ప్రభుత్వ కార్డులు లేవని, అంగన్‌వాడీలు కూడా తన పేరు నమోదు చేసుకోలేదని సారా లక్ష్మీదేవి అనే గర్భిణి తెలిపింది. తనకు 6వ కాన్పుని, ఎంత బతిమాలినా ఆస్పత్రికి రావడం లేదని, ఆమెకు సిజేరియన్ తప్పనిసరని వైద్యసిబ్బంది ఆర్డీఓకు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి కమ్యూనిటీ వైద్యశాలకు అక్కడి నుంచి ఒంగోలు రిమ్స్‌కు పంపి సర్జరీ చేసైనా ఆమె ప్రాణాలు కాపాడాలని ఆయన ఆదేశించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ నాగూల్‌మీరాను ఆదేశించారు. ఆయన సేవా నిరతిని మండల సమావేశానికి వచ్చిన అధికారులు కొనియాడారు.

ఎస్సీలకు సాగు భూములివ్వాలి

కురిచేడు: భూమిలేని ఎస్సీలకు నూతనంగా నిర్వహించే అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సాగుభూములు ఇవ్వాలని ఎస్సీ కాలనీకి చెందిన జోసఫ్.. ఆర్డీ ఓ సందీప్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. రీ సర్వేలో గుర్తించిన ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని కోరాడు.